## క్లుప్తంగా

### మాజీ మంత్రి వనితను కలసిన వేణు



మాజీ మంత్రి తానేటి వనితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వేణు

**దేవరపల్లి:** వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా నియమితులైన గోపాలపురం మండలం గోపవరానికి చెందిన సాలి వేణు శుక్రవారం దేవరపల్లి మండలం యర్నగూడెం లోని క్యాంపు కార్యాలయంలో మాజీ హోం శాఖా మంత్రి తానేటి వనితను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన మాజీ మంత్రి, గోపాలపురం నియోజక వర్గ సమన్వయకర్త తానేటి వనిత, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస్ వేణు గోపాలకృష్ణ, నాయకులకు వేణు కృతజ్ఞతలు తెలిపారు.

### బియ్యం, నగదు పంపిణీ



పేదలకు బియ్యం, పండ్లు పంపిణీ చేస్తున్న ఫాదర్ జాన్ పీటర్, ట్రస్టు వ్యవస్థాపకుడు నాగేశ్వరరావు

**దేవరపల్లి:** గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలోని పేదలకు క్లోం లలిత ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం బియ్యం, పండ్లు, స్వీట్లు, నగదు పంపిణీ చేశారు. లలిత జన్మ దినం సందర్భంగా పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ ఎస్.జాన్ పీటర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకుడు క్లోం నాగేశ్వరరావు మాట్లాడుతూ తన భార్య లలిత పేరున ట్రస్ట్ ఏర్పాటు చేసి మూడేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పుణ్యక్షేత్రంలో దాదాపు దశాబ్ద కాలంగా అన్నదాన కాంట్రాక్టరుగా పనిచేస్తూ అనేక మంది పేదలు, యాత్రికులకు అన్నదానం చేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పలువురు ఫాదర్లు, సిస్టర్లు పాల్గొన్నారు.

### ప్రిన్సిపాల్ సేవలు అభినందనీయం



గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**గోపాలపురం:** గురుకుల బాలికల పాఠశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి సేవలు అభినందనీయమని గోపాలపురం, కొవ్వూరు ఎమ్మెల్యేలు మద్దిపాటి వెంకట్రాజు, ముప్పిడి వెంకటేశ్వరరావు కొనియాడారు. శుక్రవారం గోపాలపురం గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న టి ఉమాదేవి పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి, కుమార్ దంపతులను సత్కరించారు.

### కల్వర్టులకు మరమ్మతులు

**గోపాలపురం:** వేళ్లచింతలగూడెం, పెద్దాపురం గ్రామాల మధ్య ఇటీవల నిర్మించిన కల్వర్టు వల్ల అనేక ప్రమాదాలు జరిగాయి. గురువారం తెల్లవారుజామున వేళ్లచింతలగూడేనికి చెందిన మోటార్ సైకిలిస్టుకు తీవ్ర గాయాలైన సంఘటన సాక్షిలో ప్రచురితమైంది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి శుక్రవారం కల్వర్టులకు మరమ్మతులు చేపట్టారు.

### సామూహిక ఎలుకల నిర్మూలన

**నల్లజర్ల:** రైతులందరూ సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ సూచించారు. మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎలుకల నివారణ మందు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఈ మందును నూకల్లో కలిపి రైతులకు అందిస్తామన్నారు. తొలుత వ్యవసాయ శాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చి ఎలుకల నివారణపై రైతులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

**కొవ్వూరు:** వరిలో విత్తనం నుంచి మొదలు ధాన్యం విక్రయించేంత వరకు ఎలుకలు తినే దానికన్నా ఏడు నుంచి ఎనిమిది రెట్లు అధికంగా నష్టం చేకూర్చుతాయని ఏఓ ఎ.గంగాధరరావు అన్నారు. దొమ్మేరు గ్రామంలో శుక్రవారం సాముహిక ఎలుకల నిర్ములన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు.

### రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం

**నల్లజర్ల:** పోతవరంలో శుక్రవారం సాయంత్రం రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమయ్యాయి. పొగాకు క్యూరింగ్ చేస్తుండగా సంఘటన చోటుచేసుకుంది. కుంతలగూడెం రోడ్డులో పొలాల్లో ఉన్న పాపా లక్ష్మణరావు, కర్రలపూడి పుల్లయ్యకు చెందిన ఈ బ్యారన్లు అంటుకున్నాయి. తాడేపల్లిగూడెం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు ఫైర్ ఆఫీసర్ జీవీ రామారావు తెలిపారు.

# పరిశుభ్రత కనుమురుగు

- గ్రామాల్లో అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- రోడ్లపై పారుతున్న మురుగునీరు
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- విజృంభిస్తున్న దోమలు



దేవరపల్లి-పల్లంట్ల రోడ్డులో పీహెచ్‌సీ వద్ద డ్రైనేజీ దుస్థితి



దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ

**దేవరపల్లి:** గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఎక్కడపడితే అక్కడ రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తకుప్పలు, రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు, పూడుకుపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, రోజురోజుకూ విజృంభిస్తున్న దోమలు వంటి సమస్యలతో దేవరపల్లి మండలంలోని ప్రజలు అల్లాడుతున్నారు. చీకడి పడిందంటే దోమలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దోమకాటు వల్ల ఎటువంటి వ్యాధులు సోకుతాయోనని ప్రజలు భయంతో వణికిపోతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉంది. పలు గ్రామాల్లో డ్రైనేజీ సదుపాయం లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. మురుగు నీటిలోనే ప్రజలు రాకపోకలు సాగించడం వల్ల రోగాల బారిన పడుతున్నారు. రూ.లక్షల వ్యయంతో సీసీ రోడ్లు నిర్మిస్తున్న పాలకులు డ్రైనేజీలను విస్మరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అక్కరకు రాని అండర్ డ్రైనేజీ**

మండలంలోని చిన్నాయగూడెం, దేవరపల్లి గ్రామాల్లో 2017–18లో అప్పటి ప్రభుత్వం సుమారు రూ.4 కోట్ల వ్యయంతో అండర్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించింది. డ్రైనేజీ నిర్మాణం ప్రణాళికాబద్ధంగా లేకపోవడం వల్ల మురుగునీరు ముందుకు పారక, మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు నీరు పొంగిపొర్లుతోంది. అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సిమ్మెంట్ పైపులు మట్టితో పూడుకుపోవడంతో మురుగు ఎక్కడికక్కడే నిలిపోతుందని ప్రజలు వాపోతున్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వల్ల ఉపయోగం లేదని, ఓపెన్ డ్రైనేజీ నిర్మిస్తే శ్రేయస్కరమని స్థానిక ప్రజలు అంటున్నారు. మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండడం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని, చీకటిపడితే కంటిమీద కునుకు ఉండడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉన్నప్పటికీ, పాలకులు, అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమని ప్రజలు వాపోతున్నారు. దోమల నివారణపై పంచాయతీలు పూర్తి నిర్లక్ష్యంగా ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా స్థాయి అధికారుల పర్యటన సమయంలో ఆగమేఘాలపై గ్రామాల్లో పారిశుధ్య పనులు చేసి, పంచాయతీ అధికారులు చేతులు దులుపుకొంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**నిరుపయోగంగా సంపద కేంద్రాలు**

పంచాయతీ పరిధిలోని ఇళ్ల వద్ద నుంచి తడి-పొడి చెత్తను సేకరించి సంపద సృష్టించాలని ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలు ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్నాయి. ప్రతి గ్రామంలో సుమారు రూ.3 లక్షల నుంచి రూ.7 లక్షల వ్యయంతో దాదాపు ఎనిమిదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాలు పలు గ్రామాల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో మాత్రం చెత్త రోడ్ల పక్కన కుప్పలుగా పేరుకుని ఉంటోంది. సంపద కేంద్రాలకు చెత్త చేరని పరిస్థితి నెలకొంది. ఇంటింటా చెత్త సేకరణకు ప్రభుత్వం సరఫరా చేసిన రిక్షాలు, వాహనాలు తుప్పుపట్టి మూలనపడి ఉన్నాయి.

**కార్మికుల కొరత**

పంచాయతీల్లో కార్మికుల కొరత ఎక్కువగా ఉంది. మేజర్ పంచాయతీలో సుమారు 30 నుంచి 40 మంది, మైనర్ పంచాయతీల్లో 10 నుంచి 15 మంది కార్మికులు ఉండాలి. మేజర్ పంచాయతీలో నాలుగు ట్రాక్టర్లు, మైనర్ పంచాయతీల్లో రెండు ట్రాక్టర్లు ఉండాలి. చాలా కాలంగా పంచాయతీలు కార్మికుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. మైనర్ పంచాయతీల్లో ఇద్దరు, ముగ్గురు కార్మికులు ఉంటున్నారు. మేజర్ పంచాయతీల్లో పట్టుమని పది మంది కూడా ఉండని పరిస్థితి. ప్రస్తుతమున్న కార్మికులకు కూడా నెలల తరబడి వేతనాలు ఇవ్వని పరిస్థితి నెలకొని ఉంది. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక గ్రాంటు ఉన్నప్పటికీ, సక్రమంగా వినియోగించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థపై పాలకులు, అధికారులు దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

**డ్రైనేజీ నిర్మాణం చేయాలి**



కాలనీ ఏర్పడి దాదాపు 25 ఏళ్లు అవుతుంది. రోడ్లు, డ్రైనేజీ సదుపాయం లేదు. మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. రోడ్ల సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నాం. దాదాపు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. అంతా కూలీ, నాలీ చేసుకుని జీవిస్తున్నాం. డ్రైనేజీ, రోడ్ల సదుపాయం కల్పించాలి.

– గొడ్డలి లక్ష్మి, ఇందిరమ్మ కాలనీ, దేవరపల్లి

**దోమల బెడద ఎక్కువగా ఉంది**



కాలనీలో మురుగునీరు రోడ్లపై నిలిచిపోతోంది. మురుగునీటి దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నాం. మురుగునీటికి దోమలు ఎక్కువగా ఉన్నాయి. ఒక్క డ్రైనేజీ కూడా నిర్మాణం చేయలేదు. మంచినీటి సరఫరా రెండు పూటలా ఇవ్వడం లేదు. ఇటీవల కాలనీని సందర్శించిన కలెక్టర్ పి.ప్రశాంతికి సమస్యలు మొరపెట్టుకున్నాం. దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రెండు పూటలా మంచినీరు సరఫరా చేయాలి.

– కొంగని భవాని, ఇందిరమ్మ కాలనీ, దేవరపల్లి

### ఆయుర్వేద వైద్యాధికారిగా విద్యారామన్



**దేవరపల్లి:** యర్నగూడెంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిగా విద్యారామన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం సమీపంలోని కోసూరుకు చెందిన ఆమె విజయవాడలోని ఎన్టీఆర్ మెడికల్ యూనివర్సిటీలో ఆయుర్వేద వైద్య విద్య పూర్తి చేశారు. యూనివర్సిటీ నుంచి అప్పటి రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ చేతుల మీదుగా బంగారు పతకం అందుకున్నారు. హైదరాబాద్‌లో ఎమ్మెస్ ఆయుర్వేదం విద్యను పూర్తి చేసి మొట్టమొదటిగా యర్నగూడెం ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా విద్యారామన్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందిస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, మొలలు, ఫిస్టులా తదితర వ్యాధులకు ఆయుర్వేద వైద్యం అందుబాటులో ఉందన్నారు.

### పౌష్టికాహార కిట్ల పంపిణీ

**పెరవలి:** క్షయ వ్యాధిగ్రస్తులకు ఆకుల శేషబాబు ఆర్థికసాయంతో పౌష్టికాహార కిట్లను శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో అందించారు. పీహెచ్‌సీ వైద్యురాలు అనపర్తి కృష్ణవేణి, టీబీ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ వి.ఆశాజ్యోతి మాట్లాడుతూ, క్షయ వ్యాధిగ్రస్తులు సరైన సమయంలో వైద్యం పొందితే ఇబ్బంది ఉండదన్నారు. దీనిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చని తెలిపారు. వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పి.సుచరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కూసినా..

**పట్టణంలో దర్శనమిస్తున్న ఫ్లెక్సీలు**



నిడదవోలు ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో తొలగించని ఫ్లెక్సీలు

**నిడదవోలు:** ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలై, కోడ్ అమల్లోకి వచ్చినప్పటికీ పట్టణంలో అధికార యంత్రాంగానికి పట్టినట్టు లేదు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల ఫ్లెక్సీలు, కటౌట్లు దర్శనమిస్తున్నప్పటికీ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పట్టణ పరిధిలో ఓవర్ బ్రిడ్జి సెంటర్, గణేష్ చౌక్ సెంటర్, గణపతి సెంటర్, సంత మార్కెట్, బస్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్లలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో ప్రతి వార్డులో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉన్నాయి. ప్రధానంగా గణపతి సెంటర్, ఓవర్ బ్రిడ్జి సెంటర్లలో రాజకీయ నాయకులకు సంబంధించిన ఫ్లెక్సీలు ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. పట్టణంలో గణపతి సెంటర్‌లో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు రాజకీయ నాయకుల ఫొటోలతో కూడిన ఫ్లెక్సీలు కట్టినా అధికారులు స్పందించడం లేదు. మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని ఫ్లెక్సీలను తొలగించే చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**ఎన్నికలకు సహకరించాలి**

**పెరవలి:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫిబ్రవరి 3 నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని తహసీల్దార్ డి.అచ్యుతకుమారి తెలిపారు. పెరవలి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గతంలో రెండు పోలింగ్ స్టేషన్లు ఉండేవని, ఓటర్లు పెరగటంతో మూడు స్టేషన్లు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 1,927 మంది ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేసేవారు ఫిబ్రవరి 3 నుండి 10 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు. 11వ తేదీన స్క్రూట్నీ నిర్వహిస్తామని, 13న నామినేషన్ల ఉపసంహరణ, 27న పోలింగ్ జరుగుతుందని వివరించారు. మార్చి 3న కౌంటింగ్ జరుగుతుందని చెప్పారు. ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

**గ్రాడ్యుయేట్ ఓటర్లు 1,779 మంది**

**గోపాలపురం:** ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటర్లు 1779 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ కె.అజయ్‌బాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

# బాణసంచా తయారీకి లైసెన్స్ ఉండాల్సిందే..

**జేసీ చిన్నరాముడు**



పిట్టల వేమవరంలో బాణసంచా తయారీ స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు

**పెరవలి:** బాణసంచా తయారీదారులు ప్రతి ఏడాది తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని, లైసెన్స్ ఉన్న వారు రెన్యువల్ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు తెలిపారు. పెరవలి మండలం పిట్టల వేమవరంలో బాణసంచా తయారీ కోసం పెట్టిన దరఖాస్తుపై స్థల పరిశీలిన, గోడౌన్, రక్షణ చర్యలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో బాణసంచా తయారీదారులు మందుగుండుపై ఎటువంటి జాగ్రత్తలు పాటిస్తున్నారు, తయారీ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారనే విషయాలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. గతంలో ఇదే గ్రామంలో లైసెన్స్ ఉండి, రెన్యువల్ చేయించుకోకపోవటంతో తయారీదారుడిపై కేసు నమోదు చేశారన్నారు. ఇప్పుడు నూతనంగా దరఖాస్తు చేసుకున్న పడాల రత్నకుమారి లైసెన్స్‌పై స్థల పరిశీలనకు వచ్చామన్నారు. బాణసంచా తయారీ యూనిట్ గ్రామానికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, మందుగుండు సామగ్రి ప్రదేశంలో ఎటువంటి అగ్గిరవ్వలు లేకుండా చూడటంతో పాటు, అగ్ని ప్రమాదం జరిగినా తగిన చర్యలు తీసుకునేలా రక్షణ పరికరాలు అందుబాటులో ఉండాలని వివరించారు. ఇటువంటి తయారీ సంస్థలు జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ డి.అచ్యుతకుమారి, ఆర్ఐ పావని, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**వే బ్రిడ్జి నిర్మాణాలు పూర్తి చేయాలి**

**కొవ్వూరు:** ఇసుక ర్యాంపుల్లో ఏర్పాటు చేసే వే బ్రిడ్జిల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ఆదేశించారు. శుక్రవారం ఆర్డీవో రాణి సుస్మితతో కలిసి ఇసుక ర్యాంపులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ రీచ్‌ల ద్వారా రవాణా చేస్తున్న ఇసుక అనుమతించిన పరిమితికి లోబడి లోడింగ్ చేయాల్సి ఉందన్నారు. రీచ్‌ల వద్ద విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది జవాబుదారీతనం కలిగి ఉండాలని ఆదేశించారు. ఏరినమ్మ, కొవ్వూరు, ఔరంగబాద్–1, 2, వాడపల్లి, దొండగుంట ర్యాంపుల వద్ద ఏజెన్సీల ద్వారా ఏర్పాటు చేస్తున్న వే బ్రిడ్జిలను జేసీ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి, అందుబాటులోకి తేవాలని సూచించారు. డివిజన్‌లో ఆరు వేబ్రిడ్జిలు ఏర్పాటు చేస్తున్నట్లు జేసీ తెలిపారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఫుడ్ ఫ్యాక్టరీ తనిఖీ**

**గోపాలపురం:** స్థానిక అంగస్ ఫుడ్ ఫ్యాక్టరీలో జేసీ చిన్నరాముడు, ఆర్డీవో రాణిసుస్మిత తనిఖీలు నిర్వహించారు. ఫ్యాక్టరీ ద్వారా వస్తున్న దుర్వాసన, దుమ్ముధూళితో పర్యావరణానికి విఘాతం కలుగుతున్నట్టు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీ నిర్వహించినట్లు వారు తెలిపారు. ఫ్యాక్టరీ అనుమతులు, పర్యావరణ పత్రాలను పరిశీలించారు. యాజమాన్యం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తహసీల్దార్ అజయ్‌బాబు, వీఆర్వోలు ఉన్నారు.

# బాలదుర్గమ్మ సన్నిధిలో తులాభారాలు



అమ్మవారి సన్నిధిలో అభిరామ్ చౌదరికి పటిక బెల్లంతో తులాభారం వేస్తున్న బంధువులు

**దేవరపల్లి:** గ్రామంలో వేంచేసిన బాలదుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం తులాభారాల సందడి నెలకొంది. పలువురు భక్తులు పటికబెల్లం, చిల్లర నాణేలతో తులాభారాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక నందిగం శ్రీధర్, దేవీ మణిదుర్గ దంపతులు కుమార్తెకు అమ్మవారి సన్నిధిలో పటికబెల్లం, చిల్లర నాణేలతో తులాభారం వేసి కుటుంబ సభ్యులు మొక్కుతీర్చుకున్నారు. కొవ్వూరు మండలం చిడిపికి చెందిన పాలడుగు రమేష్, రామతులసి దంపతుల కుమారుడు అభిరామ్ చౌదరికి పటిక బెల్లంతో తులాభారం వేశారు. దుద్దుకూరుకు చెందిన శ్రీకాకుళం హనుమంతు, సింధు దంపతుల కుమార్తెకు పటికబెల్లంతో కుటుంబ సభ్యులు తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పైడికొండల సత్యనారాయణ, కామిశెట్టి దుర్గారావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# అతి వేగం ప్రమాదకరం



డి.ముప్పవరంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై వీరబాబు

**నిడదవోలు రూరల్:** వాహనాలను అతివేగంగా నడపడం అత్యంత ప్రమాదకరమని సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డి.ముప్పవరం ప్రధాన సెంటర్‌లో వాహనదారులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు, డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపటం ప్రమాదకరమన్నారు. ఏఎస్సై గంగాధర్, స్టేషన్ రైటర్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఉండ్రాజవరం:** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఉండ్రాజవరంలో ప్రజలకు, ఆటో యూనియన్ సభ్యులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

**దేవరపల్లి:** రోడ్డుపై వెళ్లేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై వి.సుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. స్థానిక అంబటి సత్యనారాయణరావు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడపరాదని చెప్పారు.

**నిడదవోలు:** వాహనాలు నడిపే సమయంలో తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు, పట్టణ ఇన్‌చార్జి ఎస్సై జీఎస్ఆర్‌కే పరమహంస అన్నారు. స్థానిక గణపతి సెంటర్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఏకేఆర్‌జీ హైస్కూల్ విద్యార్థుల మాక్ డ్రిల్ ఆకట్టుకంది. పోలీసులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

### అధిక దిగుబడి సాధించాలి



సమిశ్రగూడెంలో రైతులకు ఎలుకల నివారణ మందును అందజేస్తున్న జేడీఏ

**నిడదవోలు రూరల్:** తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి, సాగును లాభసాటిగా మార్చాలని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎస్.మాధవరావు సూచించారు. మండలంలోని సమిశ్రగూడెం రైతు సేవా కేంద్రం వద్ద సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఎలుకలు పాడుచేయడం వల్ల చాలా నష్టం జరుగుతుందన్నారు. అనంతరం రైతులకు ఎలుకలు మందు తయారీకి నూకలు, బ్రోమోడయోలిన్ మందును అందజేశారు. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఏవో జి.సత్యనారాయణ, రైతులు, అగ్రికల్చరల్ అసిస్టెంటు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ పూజలు



అనంతపల్లిలో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

**నల్లజర్ల:** ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత ఆత్మార్పణ దినాన్ని ఆర్యవైశ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో అనంతపల్లి, దూబచర్ల గ్రామాలలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మండల శాఖ అధ్యక్షులు కాజు భద్రయ్య ప్రారంభించారు. వాసవీమాత చిత్రపటాన్ని, కలశాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. హాజరైన వారందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**దూబచర్లలో..**

వాసవీ యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

**కొవ్వూరు:** స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సంఘ కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్, అంజనీదేవి దంపతులతో హోమ గుండం క్రతువు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు, సాముహిక కుంకుమార్చనలు జరిగాయి.



తాళ్లపూడిలో వాసవీ కన్యకా పరమేశ్వరిని దర్శించుకుంటున్న భక్తులు

**తాళ్లపూడి:** స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప సర్పంచ్ అప్పన జగదీష్ దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలను అందజేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

**చాగల్లు:** స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు చేసి, అనంతరం విశేష పూజలు నిర్వహించారు.

### పేద విద్యార్థినికి చేయూత

**నల్లజర్ల:** భీమడోలు మండలం సూరప్పగూడేనికి చెందిన కర్రా కీర్తన 2021లో ప్రకాశరావుపాలెం వైజ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్‌క్లాస్‌లో పాసైంది. ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించలేక సర్టిఫికెట్ తీసుకోలేదు. దీంతో నాలుగేళ్లుగా ఉద్యోగం పొందలేదు. మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యుడు అల్లాడ రామకృష్ణ, సంస్థ నల్లజర్ల శాఖ రూ.10 వేల వంతున, కళాశాల యాజమాన్యం రూ.5 వేలు కలసి రూ.25 వేలు శుక్రవారం చెల్లించి కీర్తనకు సర్టిఫికెట్ అందే ఏర్పాటు చేశారు.

### ఆకుకూరల పంపిణీ

**నల్లజర్ల:** గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారాన్ని అందించాలన్న లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో పోషణ వాటికలను ఏర్పాటు చేశారని జగన్నాథపురం సర్పంచ్ చెల్లారి రామ శ్రీనివాస్ చెప్పారు. గోపాలపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దూబచర్ల సెక్టార్ జగన్నాథపురంలో 7, 8 కేంద్రాల పరిధిలో కిచెన్ గార్డెన్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు.